క్లుప్తంగా

బంకించంద్ర ఛటర్జీకి నివాళి



తిరువూరు: వందేమాతరం జాతీయ గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ జయంతి కార్యక్రమాన్ని గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం నిర్వహించారు. షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చటర్జీ చిత్రపటానికి ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం. కృష్ణ, సాయిబాబా సేవా కమిటీ నిర్వాహకులు నారాయణరావు, విద్యార్థులు నివాళులర్పించారు. వందేమాతరం గేయ విశిష్టతను వక్తలు వివరించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరువూరు: ప్రజల్లో మూఢ విశ్వాసాలు పోగొట్టి విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిస్టోఫర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా జేవీవీ సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరించారు. గంపలగూడెం మండలం వినగడప జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవికిరణ్ జేవీవీ సభ్యత్వ నమోదు పోస్టర్లు ఆవిష్కరించారు. వేదిక మండల ప్రధాన కార్యదర్శి బి. సైదులు, జిల్లా సభ్యులు ఎం సుధాకర్, వి. శరత్‌బాబు, ఎస్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇస్లాం మత ఆచారం ప్రకారం నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా కొండపల్లి షాబుకారీ మసీదు, దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్లు కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాస్ పాల్గొన్నారు. మతగురువు మహ్మద్ అల్తాఫ్ రజా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇస్లాం సంప్రదాయ బద్ధంగా వారిని సత్కరించారు. బక్రీద్ నెల ప్రారంభం సందర్భంగా మసీదులు, దర్గాల వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని అల్తాఫ్‌రజా కోరారు. లంగర్‌ఖానాలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పలువురు మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సీజ్

చాట్రాయి: లైసెన్సు లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న వరి విత్తనాలను సీజ్ చేశామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి జి.వీరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన కలవల వెంకటేశ్వరరావు ఇంటిలో 40 బస్తాల వరి విత్తనాలను సీజ్ చేసి 6ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో వ్యవసాయ అధికారి బి.శివశంకర్, తహసీల్దార్ బి.కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ మోసాలపై ధ్వజం

చాట్రాయి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్ విమర్శించారు. శుక్రవారం చాట్రాయిలో నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని, నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచిన వ్యక్తి అని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు భృతి, మహిళలకు ఫ్రీ బస్సు తదితర పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. జూలై 7న ప్రజా సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని, జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, సభ్యులు చాట్ల బాబూరావు, కలపాల వెంకటేశ్వరరావు, కళావతి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి దోపిడీ



తిరువూరు మండలం లక్ష్మీపురం చెరువులో మట్టి తవ్వకాలు (ఫైల్)

- యథేచ్ఛగా చెరువుల్లో మట్టి తవ్వకాలు
- ప్రైవేటు భూములకు, ఇటుకల బట్టీలకు మట్టి అమ్మకం
- సాగునీటి సమస్యలొస్తాయని రైతుల ఆందోళన
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు

తిరువూరు: మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉన్న సాగునీటి చెరువుల్లో మట్టిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారం తవ్వేస్తున్నారని తిరువూరు మండలంలోని పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల లక్ష్మీపురం గ్రామ సమీపంలోని అంకమ్మ చెరువులో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిగినప్పటికీ అటువైపు కన్నెత్తి చూడని అధికారులు ఇరిగేషన్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ అనుమతి ఇచ్చారంటూ సమర్థించారు. 1,200 క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే మట్టి తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వగా రెండు రెట్ల మేర మట్టిని పెద్ద గోతులు పెట్టి పొక్లెయిన్లతో తవ్వి టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇటుకల బట్టీలకు, ప్రైవేటు రియల్ వెంచర్లకు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యక్తులకు అధికారులు వత్తాసు పలుకుతుండటం గమనార్హం. కాకర్లలోని నరసింహ చెరువు, కొత్త చెరువు, ఎర్ర చెరువులో సైతం ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారం మట్టి తోలకాలు జరిపారు.

సాగునీటి సమస్యలపై ఆందోళన

చెరువుల్లో మట్టిని క్రమ పద్ధతిలో తవ్వకపోతే ఆయకట్టుకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులెదురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు తూముల కంటే లోతుగా మట్టి తవ్వుతున్నారని ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించకపోగా పై అధికారులు అనుమతి ఇచ్చారని చెబుతున్నారని వాపోతున్నారు. తిరువూరు మండలం కోకిలంపాడు తాళ్ల చెరువులో అసలు అనుమతులే లేకుండా రోజుల తరబడి మట్టి తవ్వి తరలిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు భూములకు అవసరమైన సాగునీరు చెరువు నుంచి తొలగించి మట్టి తోలకం చేపట్టడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తిరువూరు ఇరిగేషన్ స్పెషల్ సెక్షన్ ఏఈని విజయవాడకు బదిలీ చేసిన అధికారులు ఇక్కడ ఎవరినీ నియమించకపోవడంతో చెరువుల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, ఇరిగేషన్ శాఖలో పనిచేసే లస్కర్లు సైతం క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో అలసత్వం వహిస్తుండటంతో ఈ వ్యవహారానికి అడ్డే లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు.

మట్టి తోలకాలతో తీవ్ర ఇబ్బందులు



చెరువుల్లో మట్టిని ఇష్టానుసారం తవ్వితే ఆయకట్టుకు నీరందక ఇబ్బందులెదురవుతాయి. అసలే వర్షాభావంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు జరపడం తగదు.

– మాయిరి వెంకటరమణ, లక్ష్మీపురం, తిరువూరు మండలం

అనుమతులివ్వొద్దు




సాగునీటి చెరువులను క్రమపద్ధతిలో పూడిక తీయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ప్రభుత్వం వాల్టా చట్టాన్ని అమలు చేస్తున్నప్పటికీ ప్రైవేటు వ్యక్తులకు మట్టి తోలకాలకు అనధికారికంగా అనుమతులివ్వడం తగదు. ఇకనైనా చెరువుల్లో మట్టి తవ్వకాలు నిలిపివేయాలి.

– తాళ్లూరి నవీన్, కాకర్ల, తిరువూరు మండలం

చంద్రబాబు మోసాలపై ఆందోళన కార్యక్రమాలు

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



కోకిలంపాడులో మాట్లాడుతున్న స్వామిదాసు

కోకిలంపాడు(తిరువూరు): ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలను విస్మరించినందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 5 వారాల పాటు 'చంద్రబాబు మానిఫెస్టోను గుర్తుకు తెస్తూ' కార్యక్రమం చేపట్టినట్లు తిరువూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. మండలంలోని కోకిలంపాడులో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలకు తాను ష్యూరిటీ అంటూ బాండ్లు జారీచేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో చతికిలబడ్డారన్నారు. ఆడబిడ్డ పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం కార్యక్రమాల అమలులో విఫలమైనందుకు ఈ ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాళ్ళూరి నవీన్‌కుమార్, జడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఆంజనేయపురం గ్రామ సర్పంచి మామిడి కుటుంబరావు, పార్టీ నాయకులు కలకొండ రవికుమార్, చెన్ను కృష్ణప్రసాద్, ఏసురత్నం, కోటేశ్వరరావు, సీతారామయ్య పాల్గొన్నారు.

దేవదాయ ఆస్తుల సంరక్షణలో నిర్లక్ష్యం

కొడిమెల కొండయ్య సత్రం ఆవరణలో అక్రమ నిర్మాణాలు



కొండయ్య సత్రం ఆవరణలో అక్రమ నిర్మాణాలు

నూజివీడు: దేవదాయ ఆస్తుల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం ఆక్రమణదారులకు వరంగా మారుతోంది. పట్టణంలోని అమెరికన్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న కొడిమెల కొండయ్య సత్రం ఆవరణలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా ఈఓ తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రహరీ వెలుపల ఆక్రమించుకుని హోటళ్లు, బార్బర్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత ప్రహరీని కూల్చేసి ఏకంగా సత్రం స్థలంలోనే గదులు నిర్మించారు. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖాధికారి పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్వం సుదూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగులు ఉండేందుకు దాతలు సహృదయతో ఈ సత్రాన్ని నిర్మించారు. ఆ తరువాత ఈ సత్రం దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. అప్పటి నుంచి సత్రం నిర్వహణను, రోడ్డు వైపు షాపుల నిర్వహణను దేవదాయ శాఖ పర్యవేక్షిస్తోంది. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ విమర్శ



మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరువూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ తిరువూరు కమిటీ మహాసభ తిరువూరు షాదీఖానాలో శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధానిగా మోదీ మూడోసారి ఎన్నికైన నాటి నుంచి కార్మికులకు, రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులకు నష్టం కలిగించే విధంగా కార్మికుల హక్కులు కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు దాసోహం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణకై జూలై 9న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని శ్రీనివాస్ కోరారు. యూనియన్ నాయకులు బి. వెంకటేశ్వరరావు, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు. తిరువూరు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన అధ్యక్షులుగా చాపలమడుగు నాగరాజు, ఉపాధ్యక్షులుగా మారెపోగు నాగరాజు, విజయమ్మ, కార్యదర్శిగా మోదుగు సురేష్, సహాయ కార్యదర్శిగా గురజాల సుందర్రావు, గద్దల బోడెమ్మ ఎన్నికయ్యారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్



మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. సీపీఐ నూజివీడు నియోజకవర్గ 25వ మహాసభ పట్టణంలోని బత్తుల వెంకటేశ్వరరావు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రస్తుత రోజుల్లో యువత క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాయకులు రాయంకుల లక్ష్మణరావు, ఈవీ శ్రీనివాసరావు, నిమ్మగడ్డ నరసింహ, చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ విజయకుమారి

ఆగిరిపల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.విజయకుమారి అన్నారు. నిషా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన దుష్ఫలితాలు ఎదుర్కోవడమే కాకుండా చట్టపరంగా శిక్షకు గురికావాల్సి వస్తోందన్నారు. ఎక్కువగా విద్యార్థులే డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా కృషి చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాల బహూకరణ

ఆగిరిపల్లి: మండలంలోని చిన్నాగిరిపల్లి సర్నాల గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వేద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్నులు, పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా వేద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శిరీష రాణి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రధాన ఉపాధ్యాయులు జ్ఞాన సుందరం, వేద చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి శేష సాయి, ఉపాధ్యాయులు విజయశ్రీ పాల్గొన్నారు.

అనాథలకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

ఆగిరిపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా పలు సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న 18 సంవత్సరాలు నిండిన అనాథలకు ప్రత్యేక రేషన్ కార్డులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని కాసా జాతీయ స్వచ్ఛంద సంస్థ మాజీ రీజినల్ కో–ఆర్డినేటర్ పీఎస్ వరకుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఆగిరిపల్లిలో మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రకాల ప్రయోజనాలకు తప్పనిసరిగా రేషన్‌కార్డు అర్హతగా ఉన్నందున అనాథలైన వయోజనలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

జూదరుల అరెస్ట్

మల్లేల(తిరువూరురూరల్): మల్లేల శివారులోని మామిడితోటలో పెద్దఎత్తున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. 25 మంది జూదరులు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. జూదరుల నుంచి రూ.93,470 నగదు, నాలుగు కార్లు, ఒక ఆటో, మరో ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.

పెరటి మొక్కల పెంపకంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు పెరటి మొక్కల పెంపకంపై స్థానిక మూడో సచివాలయం వద్ద అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) శ్రీధరరావు పెరటి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. విజయవాడ సిటీ టెర్రస్ గార్డెన్ సంస్థ ప్రతినిధి పద్మజ వంట గది వ్యర్థాలతో వర్మికంపోస్ట్ తయారీ, ద్రవ ఎరువుల తయారీ విధానాన్ని వివరించారు. మొక్కలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణ మార్గాలను తెలిపారు. వివిధ రకాల కూరగాయ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీటీజీ సభ్యులు వంగూరు ప్రకాశ్, ఆలూరి వెంకటేశ్వరరావు, రమేష్, సీఎంఎం కో–ఆర్డినేటర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని చనుబండ పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సి-గుడిపాడు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రుచికరంగా నాణ్యమైన భోజనాన్ని తయారు చేయాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగానమ్మ సంబరాలు



నూజివీడు: పట్టణంలోని జంగాలపేటలో గంగానమ్మ సంబరాలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా వెళ్లి శివాలయంలో అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు.

ఆలయాల్లో విశేష పూజలు



తిరువూరు: శ్రీరామచంద్రుడు జన్మించిన పునర్వసు నక్షత్రం సందర్భంగా తిరువూరు కోదండ రామాలయంలో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. స్వామివారి మూల విరాట్‌కు తిరువంజనం, అభిషేకం, ప్రత్యేక పూజలు, నూతన వస్త్రాలంకరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు గోపీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండ రామాలయం అర్చకులు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీరామచంద్రస్వామికి నారికేళ అభిషేకం, జలాభిషేకం, నూత వస్త్రాలు, పూలతో అలంకరణ నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



తిరువూరు: ఎ.కొండూరు మండలం కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, ప్రవాసాంధ్రుడు వై. చైతన్య ప్రింటర్‌ను వితరణగా ఇచ్చారు. తన తల్లి నాగశిరోమణి జ్ఞాపకార్థం ఈ ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశామని ఆయన చెప్పారు. ఇటీవల గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థులకు సదుపాయాల కల్పనకు దాతలు సహకరించాలని రాంప్రదీప్ కోరారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

ఆర్టీసీ డీపీటీఓ షేక్ షబ్నం



కార్మికులతో మాట్లాడుతున్న డీపీటీఓ షేక్ షబ్నం

నూజివీడు: డిపో పరిధిలోని సమస్యలను, కార్మికుల ఇబ్బందులను, ప్రయాణికులకు ఎదురయ్యే అసౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్టీసీ ఏలూరు డీపీటీఓ షేక్ షబ్నం అన్నారు. శుక్రవారం ఆమె ఆర్టీసీ డిపోను సందర్శించి ప్రతి విభాగాన్ని పరిశీలించారు. బస్టాండ్ ఆవరణను, డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతి తీసుకునే గదులను, టాయిలెట్లను, గ్యారేజీని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి బస్సు సర్వీసులను సమయానికి నడపాలన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు.

రద్దీని బట్టి నూతన సర్వీసులు

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీని బట్టి నూతన సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. డిపోలో ఆర్టీసీకి చెందిన బస్సులు 55 ఉన్నాయని, వీటిలో కాలం చెల్లినవి ఏమైనా ఉంటే వాటి స్థానంలో నూతన బస్సులు వచ్చేలా చూస్తామన్నారు. ప్రయాణికులకు బస్టాండ్ ఆవరణలో మంచి నీటి సదుపాయం కల్పించడం, టాయ్‌లెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షం వచ్చినప్పుడు బస్టాండ్ ఆవరణలోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయా సంఘాల నాయకులు, కార్మికులతో చర్చలు నిర్వహించి సకాలంలో సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. నూజివీడు డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్ కుమార్, ట్రాఫిక్ సీఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు తనిఖీ

కాకర్ల(తిరువూరురూరల్): మండలంలోని కాకర్లలో శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్ పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, గ్రీన్ అంబాసిడర్ల సేవలు వినియోగించుకోవాలని, పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని ఆయన పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మాణంలో ఉన్న పశువుల తొట్టెలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి రామబ్రహ్మం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ప్రాంతం, గొడుగువారిగూడెం, గాంధీనగర్, కుమ్మరిపేట, స్టేషన్ తోట, ధందం గార్డెన్, అజరయ్యపేటలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఇన్‌చార్జి సీఎంఎంగా చోరగుడి దుర్గ

నూజివీడు: పట్టణంలోని స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన మెప్మా ఇన్‌చార్జి సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)గా కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీఓ)గా పని చేస్తున్న చోరగుడి దుర్గ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సీఓ లటికే నాగోజీ తాడిగడప మున్సిపాలిటీకి బదిలీ కాగా మచిలీపట్నం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న దుర్గ నూజివీడుకు బదిలీ అయ్యారు. ఏడాది కాలంగా సీఎంఎం లేకపోవడంతో దుర్గకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

సబ్ రిజిస్ట్రార్ డెప్యుటేషన్ రద్దు

నూజివీడు: డెప్యుటేషన్‌పై నూజివీడు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాఘవరావు డెప్యుటేషన్‌ను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు రద్దు చేశారని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కొందరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో రాఘవరావు డెప్యుటేషన్‌ను రద్దు చేసి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు.